క్లుప్తంగా

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద నిరంతర నిఘా

ఆర్వో వెంకటరావు



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టవంతమైన నిఘా ఏర్పాటు చేశామని కాకినాడ సిటీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి జే. వెంకటరావు తెలిపారు. శనివారం ఆయన జేఎన్టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులతో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. మరోవైపు సీసీ కెమెరా నిఘా కూడా కొనసాగుతుందన్నారు. ఎప్పటికప్పుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని ఆర్వో చెప్పారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాన్ని కూడా సందర్శించారు. జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్‌కు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట పలువురు ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

భజే ఆంజనేయం



మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామివారికి ఆకుపూజ చేస్తున్న అర్చకులు

- హనుమంతునికి పంచామృతాభిషేకాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు





బాలాత్రిపుర సుందరి ఆలయంలో అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకొంటున్న భక్తులు. స్వామివారికి తమలపాకులతో పూజ చేస్తున్న అర్చకుడు



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్ద స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బోట్‌క్లబ్: నగరంలోని పలు ఆలయాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకూ స్వామివారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి వారి ఆలయంలో పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన చేశారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి స్వామి వారికి స్వామి వారికి వడమాల సమర్పించారు. స్థానిక రిజర్వు పోలీస్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి వివిధ నదీ నలాలతో అభిషేకం నిర్వహించారు. గంధ సింధూర పూజ, తమల పాకుల పూజ ఎంతో వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అందంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం చేశారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి తమలపాకుల పూజ, వడమాల కైంకర్యం చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక రామారావుపేట శివాలయంలోని ఆంజనేయస్వామికి, స్థానిక దేవాలయంవీధిలోని అభయాంజనేయ స్వామికి విశేస పూజలు నిర్వహించారు. స్థానిక ఎల్‌బీనగర్‌లోని ఆంజనేయస్వామి వారికి తమలపాకులపై శ్రీరామ నామాలు రాసి పూజ చేశారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో సత్యశావాహినిలో ఉన్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించారు. స్థానిక కొండయ్యపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కొండయ్యపాలెం రైల్వేగేటు సమీపంలో ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అరటి గెలలతో ప్రత్యేకంగా అలంకరించారు. వీటితో పాటు నగరంలో పలు హనుమంతుని ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీరామ దూతం శిరసా నమామి అంటూ భక్తులు ఆంజనేయ స్వామిని స్మరిస్తూ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు, ప్రత్యేక పూజలతో తరించారు. కాకినాడ రూరల్‌లో శనివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్ద ఆంజనేయ స్వామి ఆలయానికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ, వాకలపూడి, వలసపాకల, పండూరు, తిమ్మాపురం, ఇంద్రపాలెం, చీడిగ, రేపూరు తదితర గ్రామాలలో భక్తులు ఆంజనేయ స్వామి విగ్రహాలు, ఆలయాల వద్ద హనుమజ్జయంతి పూజలతో తరించారు.

పలు ప్రాంతాల్లో..

కాకినాడ సిటీ: రూరల్ మండలం తూరంగి, కొవ్వూరు, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో శనివారం స్వామి వారికి సింధూర పూజలు చేశారు. లక్ష తమలపాకులతో సహస్ర నామ పూజలు, హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం నిర్వహించారు. అభయాంజనేయస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. తూరంగి ఏఎస్ఆర్ కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పెద్ద ఎత్తున మహిళలు మామిడిపళ్లతో పూజలు చేశారు.

విద్యా ప్రమాణాలను వివరించాలి



కరపలో ఎస్‌జీటీలతో సమీక్షిస్తున్న డీఈఓ రమేష్

- ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి
- విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా ప్రోత్సహించాలి
- ఎస్‌జీటీలతో డీఈఓ రమేష్ సమీక్ష



హాజరైన కరప, పెదపూడి మండలాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు

కరప: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు, అమలుచేస్తున్న పథకాలను వివరిస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించేలా చైతన్య పరచాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కరప, పెదపూడి మండలాల ఎస్‌జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్స్) ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న గ్రామాల్లోని తల్లిదండ్రులను కలసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు, క్వాలిఫైడ్ టీచర్లతో విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం, ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూస్ వంటి వసతులు అందిస్తున్న విషయాలను వివరించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల పోటీని ఎదుర్కొనేందుకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చర్చించుకుని, పిల్లలను ఆకర్షించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపిస్తే క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తామని తల్లిదండ్రులకు భరోసా కల్పించాలన్నారు. అందుకు ప్రతి ఉపాధ్యాయుడుకు సొంతంగా ఎకడమిక్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించకపోవడంలోని లోపాలను గుర్తించి, వాటిని సరిచేసి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అన్ని చర్యలు తీసుకోవాలని డీఈఓ రమేష్ సూచించారు. ఉపాధ్యాయులు పనితనాన్ని మెరుగుపరచుకుని, ప్రజల్లో గుర్తింపు పొందాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా ఎంత మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారో సమీక్షించి, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించి, ఉపాధ్యాయులకు డీఈఓ రమేష్ అవగాహన కల్పించారు. డీవైఈఓ కె.వెంకటేశ్వరరావు, కరప, పెదపూడి మండలాల విద్యాశాఖాధికారులు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం కోరుతూ అన్నవరానికి పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరిన శెట్టిబలిజ సంఘం నాయకులు

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయాలని కోరుతూ కాకినాడ సాంబమూర్తినగర్ కౌండిన్య శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు శనివారం అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. శనివారం ఉదయం సాంబమూర్తి నగర్‌లో వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రగా బయలుదేరి వెళ్లి అన్నవరంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగాను, కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మరోసారి ఎమ్మెల్యేగాను, ఎంపీగా చలమలశెట్టి సునీల్ విజయకేతనం ఎగురవేయాలని కోరుతూ ఈ పాదయాత్రను చేపట్టారు. సంఘం గౌరవ అధ్యక్షుడు చింతాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ ఐదేళ్ల కాలం ప్రజాసేవలకే అంకితమైన జగన్ రెండోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎవరికి ఏ ఆపద వచ్చినా ఏ సమస్య ఉన్నా నేను ఉన్నానంటూ ముందుకు వచ్చి అన్ని వర్గాల పక్షాన నిలిచి ముందుండి పోరాడే వ్యక్తిగా కాకినాడ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. పాదయాత్రలో శెట్టిబలిజ సంఘ నాయకులు కాకరపల్లి చంద్రశేఖర్, కడియాల సూర్యనారాయణ, మోహన్‌కృష్ణ, కుడుపూడి భద్రం, అనసూయ, సతీష్, గుత్తుల అపర్ణ దుర్గ, దమ్ము అప్పారావు అన్నవరం బయలుదేరారు.

పరిశ్రమలశాఖ జీఎంగా ఆదిశేషు

కాకినాడ రూరల్: జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్‌గా ఏలూరు పరిశ్రమలశాఖ జీఎం వి.ఆదిశేషు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జీఎంగా పని చేసిన వి.మురళి లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి చిక్కారు. గత నెల 22వ తేదీన రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన జీఎం మురళిని ఏసీబీ అధికారులు కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. ఏసీబీకి చిక్కిన జీఎం మురళిని మరుసటి రోజు 23వ తేదీన ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ జీవో విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఏలూరు జీఎంకు కాకినాడ జిల్లా అదనపు బాధ్యతలను గత నెల 29న అప్పగించడంతో ఆయన శనివారం చేరారు.

నేడు గాంధీభవన్‌లో కవి స్వరం సభ

బోట్‌క్లబ్: స్థానిక గాంధీభవన్‌లో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కథకుడు జి. వెంకటకృష్ణ సాహిత్య పరిచయం, కవిస్వరం సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు మార్ని జానకి రామ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటకృష్ణ సాహిత్య నేపథ్యాన్ని అద్దేపల్లి ప్రభు పరిచయం చేస్తారన్నారు. అనంతరం జరిగే కవిసమ్మేళనం కార్యక్రమంలో కవులందరూ స్వీయ కవితా పఠనం చేయాలని కోరారు.

8 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు



రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల కరపత్రికను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కాకినాడ సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు శ్రీకాకుళం జిల్లాలో 8 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ నాయకులు పి.వరహాలు, ఎం.గంగా సూరిబాబులు తెలిపారు. శనివారం కాకినాడలోని సుందరయ్యభవన్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల కర పత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో జరుగుతున్న విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని, ఎస్‌ఎఫ్‌ఐ, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జి.శ్రీకాంత్, ఎ.వాసుదేవ్, సాహిత్, గోపాలకృష్ణ, సిద్ధు, లోవరాజు, వెంకటేష్, అరుణ్‌కుమార్, చిన్ని పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహన డ్రైవర్లకు రెండు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, డ్రైవర్స్ యూనియన్ కోశాధికారి ఇస్మాయిల్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నెల జీతం ఇప్పటికీ జమ కాలేదన్నారు. కమిషనర్ వెంకటరావు జీతాలు చెల్లించాలని ఆదేశించారన్నారని, వాటిని విడుదల చేయాలని కోరారు. యూనియన్ నాయకులు సంతోష్, విక్టర్, భద్ర, రాజేష్ పాల్గొన్నారు.

దోమ కాటు ఆరోగ్యానికి చేటు



తూరంగి డ్రైవర్స్‌కాలనీ, పగడాలపేటల మధ్య ఖాళీ స్థలాల్లో దోమలకు నిలయంగా మారిన మురుగునీరు

- దోమ కాటుతో ప్రబలుతున్న వ్యాధులు
- ఇటీవల కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నీరు చేరటంతో విజృంభిస్తున్న దోమలు
- పలు రోగాలతో ఆస్పత్రుల్లో చేరుతున్న రోగులు
- తగు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

కాకినాడ సిటీ: మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల కాలంలో వర్షాలు కురుస్తున్నాయి. మండలాలు, పట్టణాల్లో ఆయా గ్రామాలు, కాలనీల్లో పల్లపు ఖాళీ స్థలాల్లో చేరిన వర్షపు నీరు అక్కడే నిల్వ ఉండిపోతోంది. ఇది మురుగుమయమై దోమల కార్ఖానాగా మారుతోంది. దోమల దాడితో పాటు మారిన వాతావరణ పరిస్థితులు, అపరిశుభ్ర పరిసరాల వల్ల కలుషిత నీరు తాగడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ తరుణంలో దోమల వల్ల కలిగే అనర్థాలు. వచ్చే జబ్బులు, వాటి లక్షణాలను గూర్చి తెలుసుకోవాలని కరప మండల వైద్యాధికారి శ్రీనివాసనాయక్ సూచిస్తున్నారు.

మలేరియా వ్యాధి లక్షణాలు

అనాఫిలిస్ అనే దోమ కాటు వల్ల మలేరియా జ్వరం వ్యాపిస్తుంది. నిల్వ ఉన్న నీరు, లేదా తాగునీటిలో ఈ దోమ వృద్ధి చెందుతుంది. ఈ దోమవల్ల వచ్చిన జ్వరం 10 నుంచి 14 రోజులపాటు ఉండి వాంతులు కూడా అవుతుంటాయి.

డెంగీ లక్షణాలు

సాధారణంగా ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిలో డెంగీ దోమ గుడ్లు పెడుతుంది. ఈ వ్యాధి సోకితే 15 రోజుల పాటు జ్వరం ఉధృతంగా ఉంటుంది. తల నొప్పి, నొసటిపై, కంటి లోపల నొప్పితో రోగి చాలా బాధపడుతుంటాడు. కడుపు నొప్పి కూడా వస్తూ ఉంటుంది.

చికున్ గున్యా లక్షణాలు

ఈడిస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చిన్నగా, నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలు ఉంటాయి. ఈ వ్యాధి బారిన పడిన రోగికి 10 నుంచి 14 రోజుల పాటు తీవ్ర నొప్పులతో కూడిన జ్వరం ఉంటుంది. జ్వరం తగ్గినా మరో 10 రోజుల పాటు తీవ్రంగా ఒళ్లు నొప్పులు ఉంటాయి.

మెదడువాపు వ్యాధి లక్షణాలు

మెదడువాపు వ్యాధి ప్రాణంతకమైనది. క్యూలెక్స్ దోమ వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ దోమ ఎక్కువ రోజుల పాటు మురుగునీటి నిల్వల్లో పెరుగుతుంది. 14 రోజుల పాటు తీవ్రమైన జ్వరంతో బాధపడుతుంటారు. మత్తుగా సోలిపోతుంటారు. ఈ జ్వరం తీవ్రమైతే బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సాధారణంగా ఈ జ్వరం రెండు నుంచి 14 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది.

దోమల నుంచి రక్షణ పొందాలి



ఇటీవల కాలంలో అక్కడక్కడ వైరల్ ఫీవర్లు నమోదవుతున్నాయి. దోమల దాడి నుంచి రక్షణ పొందాలి. వైరల్ ఫీవర్ వస్తే మందులు వాడితే తగ్గుతుంది. అలా కాకుండా జలుబు, తలనొప్పి, వాంతులు, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలి. అజాగ్రత్తగా ఉంటే వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

– డాక్టర్ శ్రీనివాసనాయక్, కరప మండల వైద్యాధికారి.

దోమల నియంత్రణకు చర్యలు

- మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి.
- మురుగు కాల్వల్లో నీరు సక్రమంగా పారేలా చేయాలి.
- పరిసర ప్రాంతాల్లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించుకోవాలి.
- ఇళ్ల మధ్య గుంతల్లో నిలిచిన నీరు ఎక్కువ కాలం నిల్వ లేకుండా చూసుకోవాలి.
- అన్ని రకాల నీటి నిల్వల్లో వారానికి ఒకసారి దోమల నియంత్రణ మందు వేయాలి.
- దోమలు కుట్టకుండా దోమతెరలు ఇతరత్రా విధానాలు అవలంబించాలి.

